క్లుప్తంగా

వైభవంగా పీర్ల పండుగ



పీర్లు ఊరేగిస్తున్న ముస్లింలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని పీర్ల చావిడి వద్ద నిర్వహిస్తున్న పీర్ల పండుగ అంగరంగ వైభవంగా జరుగుతోంది. వేడుకలలో భాగంగా మంగళవారం రాత్రి నిప్పుల గుండాన్ని వెలిగించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని రైతులు పాడిపంటలతో తులతూగాలని, ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ముజావర్లు షేక్ సైదా, మొయిన్, నాగుల్ మీరా, పాషా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పీర్ల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో నాగుల్ మీరా, చాంద్ పాషా, అన్వర్ బాబా, కె.హుస్సేన్, పాలకూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మోతె : ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోతె ఎస్సై మహేష్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున వాగులు, వంకలు, కాల్వలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు వాగులు, కాల్వలు దాటవద్దని తెలిపారు. వర్షం కురుస్తున్నప్పుడు చెట్ల కింద, కరెంట్ స్తంభాల వద్ద ఉండవద్దని చెప్పారు. అవసరమైతేనే ఇంట్లో నుంచి ఆరుబయటకు వెళ్లాలని తెలిపారు. రైతులు వ్యవసాయ మోటార్ల వద్ద జాగ్రత్త వహించాలని సూచించారు.

సోలార్ పవర్ ప్లాంట్‌పై అవగాహన

నడిగూడెం : మండల పరిధిలోని నారాయణపురంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం రామలక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు విద్యుత్ వినియోగం తగ్గించుకొని సోలార్ పవర్ ప్లాంట్ యూనిట్‌ను ఉపయోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీసీ సాంభయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

కిట్స్ కళాశాలలో ముగిసిన టాస్క్ క్లాసులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ రామ్‌మనోజ్

కోదాడఅర్బన్ : పట్టణ పరిధిలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న టాస్క్ క్లాసులు బుధవారం ముగిశాయి. సీఎస్‌సీ విద్యార్థులకు టెక్నాలజీ, మీడియా మేనేజ్‌మెంట్, లీడర్‌షిప్, క్రియేటివిటీ, కోలాబరేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, సోషల్ స్కిల్స్‌పై 21వ సెంచరీ ట్రాన్స్‌ఫరబుల్ స్కిల్స్ టాస్క్ ట్రైనర్ పి.రామ్ మనోజ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గాంధీ, అకడమిక్ డైరెక్టర్ పోతుగంటి నాగేశ్వరరావు, అకడమిక్ అడ్వయిజర్ డాక్టర్ నాగార్జున వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి



తాగునీటి బోరు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రామారావునాయక్

మఠంపల్లి : మండలంలోని కృష్ణాతండాలో తాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ రామారావునాయక్ తెలిపారు. ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ మంజూరు చేసిన మండల పరిషత్ నిధులతో బుధవారం గ్రామంలో తాగు నీటికోసం బోరు వేసే పనులను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జయమ్మ మట్టపల్లి నాయక్, మాజీ ఉపసర్పంచ్ తులసీ సైదానాయక్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌టీపీ మండల, గ్రామ శాఖల ఏర్పాటు

హుజూర్‌నగర్ : వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు నియోజకవర్గంలో వైఎస్సార్‌టీపీ మండల, గ్రామ అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల నియామకం చేపట్టినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ జల్లేపల్లి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మఠంపల్లి మండల అధ్యక్షుడిగా మైలబోయిన కొండలు నియమించినట్లు తెలి పారు. హుజూర్‌నగర్ మండల అధ్యక్షుడు మర్రి రవీందర్‌రెడ్డి సూచనల మేరకు సీతారాంపురం గ్రామ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బైరి సందీప్, ఎలకరాజుల అనిల్‌ను, గోపాలపురం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎరబోలు నర్సింహారావు, సిద్దల గోపిలను, అమరవరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సింగతాల నరేందర్‌రెడ్డి, అంబేద్కర్‌లను, వేపలసింగారం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మాలావత్ జాన్‌నాయక్, సైదులును, బూరుగడ్డ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మట్టపల్లి, వెంకటేష్‌లను నియమించినట్లు తెలిపారు.

రోడ్లపై గుంతలు.. వానొస్తే కష్టాలు

- అధ్వానంగా లింక్, అంతర్గత రహదారులు
- గ్రామాల్లో చిత్తడిగా మారుతుండటంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



నడిగూడెంలోని గాంధీ పార్క్ ఎదుట గుంతలమయంగా రోడ్డు

నడిగూడెం : మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. దీంతో ప్రజలు ఏళ్ల తరబడి నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మండల పరిధిలోని వేణుగోపాలపురం నుంచి కరివిరాల, వల్లాపురం నుంచి చనుపల్లి, నడిగూడెం నుంచి నారాయణగూడెం, ఎకలాస్‌ఖాన్‌పేట నుంచి ముకుందాపురం, సిరిపురం నుంచి శ్రీరంగాపురం, వల్లాపురం నుంచి శ్రీరంగాపురం, వేణుగోపాలపురం నుంచి ఆంజనేయనగర్, నారాయణపురం క్రాస్ రోడ్డు నుంచి గ్రామాలకు వెళ్లే లింకు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రహదారులు కంకరతేలి, రోడ్లను ఇరువైపులా కంపచెట్లు కమ్మేశాయి. రోడ్లపై లోతైన గుంతలు ఏర్పడటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.



వల్లాపురంలో చిత్తడిగా మారిన రహదారి



కరివిరాల- వేణుగోపాలపురం మధ్య..

అంతర్గత రోడ్లూ అధ్వానమే..

మండల కేంద్రంతో పాటు, బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, వెంకట్రాంపురం, కరివిరాల, కాగితరామచంద్రాపురం, నారాయణపురం, సిరిపురం, వల్లాపురం, శ్రీరంగాపురం, చాకిరాల, రత్నవరం, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, ఎకలాస్‌ఖాన్‌పేట తండా, తెల్లబెల్లి గ్రామాలలోని అంతర్గత రహదారులు సైతం అధ్వానంగా మారాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు లోతైన గుంతలు ఏర్పడడంతో పాటు, వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. గుంతలమయంగా మారిన రోడ్లపై ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వీధుల్లోని రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగల సంచారం పెరిగింది. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదకరంగా మారింది



కరివిరాల నుంచి వేణుగోపాలపురం వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై కంకర తేలి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రహదారిని కంపచెట్లు కమ్మేశాయి. బీటీ రహదారి నిర్మిస్తే ఇరు గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

– నక్క చంద్రం, కరివిరాల

అధికారులు స్పందించాలి



వల్లాపురం – శ్రీరంగాపురం గ్రామానికి వెళ్లే రహదారి గుంతలమయంగా ఉంది. చినుకు పడితే గ్రామంలోని పలు వీధులు చిత్తడిగా మారుతుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– వట్టికూటి గురునాథం, వల్లాపురం

50 ఫీట్ల రోడ్డు ఆక్రమణను అడ్డుకోవాలి

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని 50 ఫీట్ల రోడ్డు ఆక్రమణను అడ్డుకుని, సీసీ రోడ్డు నిర్మాణం, రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ పనులు చేపట్టాలని ఆ రోడ్డు పరిరక్షణ సమితి ప్రతినిధులు బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 ఫీట్ల రోడ్డు నాలుగు వార్డుల పరిధిలో ఉంటుందని, రోడ్డు ఆక్రమణకు గురవుతున్నా మున్సిపల్ అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదన్నారు. వర్షాలు వచ్చినప్పుడు రోడ్డు చిత్తడిగా మారి బురదమయంగా మారుతుందన్నారు. డ్రెయినేజీ లేకపోవడంతో ఎక్కడి మురుగునీరు అక్కడే నిలిచి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. కార్యక్రమంలో రోడ్డు పరిరక్షణ సమితి ప్రతినిధులు రాచకొండ శేఖర్‌రావు, వాసపల్లయ్య, వేణుగోపాల్‌రెడ్డి, మధు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, జోషి తదితరులు ఉన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రోడ్డు పరిరక్షణ సమితి ప్రతినిధులు

ప్రతికూల ఆదేశాలు జారీ చేయొద్దు

హుజూర్‌నగర్ : భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర బార్ అసోసియేషన్‌ల ఫెడరేషన్ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు బుధ, గురువారాల్లో కక్షిదారులు, న్యాయవాదులు కోర్టుకు హాజరుకానట్లయితే ఎలాంటి ప్రతికూల ఆదేశాలు, నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేయవద్దని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలతో హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సుజన బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలి పారు. విజ్ఞాపనను సమ్మతించినందుకు వారు హైకోర్టు న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలిపారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

నేరేడుచర్ల : మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన దుండగులను కఠినంగా శిక్షించడంతో పాటు ఆ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ అనుబంధ మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు ఎ.లక్ష్మి డిమాండ్ చేశారు. ఈమేరకు ఆ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ గుండాలు మతోన్మాద సిద్ధాంతాలను అనుసరిస్తూ కులాలు, మతాలతో రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. మణిపూర్‌లో గత కొద్ది నెలలుగా కుకీ, నాగ జాతుల మధ్య జరుగుతున్న వర్గ పోరును అరికట్టడంతో కేంద్రం, ఆ రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు అరుణ, బాయమ్మ, తిరుపతమ్మ, పద్మ, మంగ, లక్ష్మమ్మ, సత్యావతి, నాగమణి, శాంతమ్మ తదితరులు ఉన్నారు.



నేరేడుచర్లలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మహిళా సమాఖ్య నాయకులు

మణిపూర్ దుండగులను ఉరి తీయాలి

గరిడేపల్లి : మణిపూర్‌లో గిరిజన తెగ మహిళలపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను బహిరంగంగా ఉరి తీయాలని అఖిల భారత యువజన సమాఖ్య మండల అధ్యక్షుడు పంగ సైదులు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనపై బుధవారం అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నందిపాటి కాశయ్య, పోకల నర్సింహారావు, లింగరాజు తదితరులు ఉన్నారు.

ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

గరిడేపల్లి : మణిపూర్‌లో జాతుల మధ్య రగిలిన జ్వాలలు చల్లార్చలేని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తక్షణమే రాజీనామా చేయాలని క్రైస్తవ సంఘాల పాస్టర్లు, విశ్వాసులు అన్నారు. మణిపూర్ ఘటనకు నిరసనగా బుధవారం మండల కేంద్రంలో వారు శాంతి ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలపై కేంద్రం స్పందించి దేశంలో సెక్యులరిజాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సుధాకర్, చైర్మన్ మెడి పౌలు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంద్రియా, ఉపాధ్యక్షుడు ప్రసాద్, డేవిడ్‌రాజు, మండల అధ్యక్షుడు శామ్యూల్, గుండు దేవదానం, జాన్‌పాల్, కరుణాకర్ రెడ్డి, జాకబ్, రాజు, ఇస్సాక్, జ్యోతిబాబు, జాన్సన్, ఇమ్మానియేలు, పాస్టర్లు పాల్గొన్నారు.



గరిడేపల్లిలో నిరసన తెలుపుతున్న పాస్టర్లు

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



మఠంపల్లిలో అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు



కోదాడరూరల్ : వంటావార్పు నిర్వహించి సహపంక్తి భోజనాలు చేస్తున్న కార్మికులు



మేళ్లచెరువు : సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

మోతె : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు చిట్టాల రవిచంద్ర మాట్లాడుతూ గత 21 రోజుల నుంచి కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

పంచాయతీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

మఠంపల్లి : తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరుతూ మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు బుధవారం అర్ధనగ్న ప్రదర్శనతో వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్ రన్‌మియా, పంచాయతీ సిబ్బంది యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇంటి రవి, ఎం.మైసయ్య, మోతీలాల్, పిచ్చయ్య, నరసింహారెడ్డి,, దేవదానం, వెంకటేశ్వర్లు, రహీం, వెంకటి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

మేళ్లచెరువు : మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె బుధవారం 21వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, సైదులు, మరియమ్మ, శ్రీనివాసరావు జ్యో తిరాణి, సైదా నాయక్, నర్సయ్య, వీరయ్య, సీత య్య, పద్మ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ జీపీ కార్మికుల సమ్మె

కోదాడరూరల్ : కోదాడ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం 21వ రోజుకు చేరుకుంది. ఎడతెరిపి లేకుండా వర్షం కురిసినా కార్మికులు తడుస్తూనే సమ్మెను కొనసాగించారు. వంటావార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు భారీగా తరలివెళ్తామని అన్నారు. కార్యక్రమంలో ముత్తయ్య, శంకర్, వెంకటేశ్వర్లు, లింగయ్య, కొండలు, ఉష, స్వాతి, రామనాయుడు, రాముడు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు షేక్ హుసేన్‌మియా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల సమ్మెలో ఆయన మాట్లాడారు. ఆ సంఘం ఉపాధ్యక్షుడు కొండలు, రత్నం, యల్లమ్మ, ప్రసాద్, వీరారెడ్డి, అంజయ్య, సునీల్, కనకయ్య, శ్రీనివాసరెడ్డి, మట్టయ్య తదితరులు ఉన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వేదమంత్రాలతో విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర కుంకుమార్చనలు గావించారు. ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో స్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ వేడుకల్లో భాగంగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాభంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్య ధారణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీ నరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, బ్రహ్మాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయాలకు ప్రతీక తీజ్



తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎంపీపీ కవితారెడ్డి

కోదాడఅర్బన్ : గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ అని కోదాడ ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. బుధవారం కోదాడ పరిధిలోని బాలాజీనగర్‌లో జరిగిన తీజ్ వేడుకల్లో ఆమె పాల్గొని గోధుమ నారు బుట్టలను తలపై పెట్టుకుని గిరిజనులతో కలిసి ఆడిపాడారు. కార్యక్రమంలో గిరిజన యువతులు, పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వీరేపల్లికి ఎమ్మెల్యే పరామర్శ

కోదాడఅర్బన్ : కోదాడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వీరేపల్లి లక్ష్మీనారాయణరావు సతీమణి సత్యవతి మూడు రోజుల క్రితం పరమపదించారు. బుధవారం హైదరాబాద్‌లో సత్యవతి పార్థివదేహాన్ని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి వీరేపల్లిని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా హైదరాబాద్‌లో సత్యవతి అంత్యక్రియలు జరిగాయి. కోదాడ నుంచి పలువురు ప్రముఖులు వెళ్లి ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



వీరేపల్లి లక్ష్మీనారాయణరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి



కోదాడఅర్బన్ : కల్నల్ సంతోష్‌బాబు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

కోదాడఅర్బన్ : దేశరక్షణకు కార్గిల్‌లో వీరోచితంగా పోరాడి అమరులైన యోధులను స్మరించుకుంటూ కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకుంటున్నామని వాసవీ యూత్ క్లబ్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా వాసవీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిపై గల కల్నల్ సంతోష్‌బాబు, లాన్స్ నాయక్ గోపయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐవీఓ కార్యాలయంలో మాజీ సైనికులను ఐవీఓ స్టేట్ ప్రెసిడెంట్ విజ్జిని రవీందర్‌రావు, అర్జున అవార్డు గ్రహీత స్టేట్ కోఆర్డినేటర్ గూండా మధుసూదన్ చౌదరి, వాసవీ యూత్ క్లబ్ రీజియన్ చైర్మన్ జగనీ ప్రసాద్‌లు మెమొంటో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ యూత్ క్లబ్ సభ్యులు, పాల్గొన్నారు.

విద్యార్థులు సైనికుల స్ఫూర్తితో ఎదగాలి

కోదాడఅర్బన్ : దేశ రక్షణ కోసం తమ జీవితాలను త్యాగం చేసే సైనికుల స్ఫూర్తితో విద్యార్థులు ఎదగాలని న్యూ విజన్ పాఠశాల చైర్మన్ సీహెచ్ గోపాలకృష్ణ ప్రసాద్ అన్నారు. బుధవారం పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యాక్రమాలు నిర్వహించారు. అనంతరం మానహారంతో దేశ ఐక్యతను చాటారు. పాఠశాల డైరెక్టర్ కేశినేని శ్రీదేవి, సీహెచ్ కార్తీక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రతలో కార్మికుల పాత్ర కీలకం

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలో పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి అన్నారు. బుధవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయం ఆవరణలో బుధవారం మున్సిపల్ కార్మికులకు రెడియం జాకెట్‌లు, రెయిన్ కోట్‌లు, హ్యాండ్ గ్లౌజులు, టవల్స్, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ భారత్‌లో మెరుగైన ర్యాంకులు సాధించేందుకు కార్మికుల సేవలకు తోడు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు, మేనేజర్ షేక్ యాకూబ్ పాషా, ఎస్ఏ రంగారావు, హెచ్ఏ అశోక్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కార్మికులకు రెయిన్ కోట్‌లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

ఎడతెరిపి లేని వర్షాలు.. ఉధృతంగా వాగులు



మఠంపల్లి : బక్కమంతులగూడెంలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, కార్యదర్శి



కోదాడరూరల్ : చిమిర్యాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఉలకవాగు



నేరేడుచర్ల : కల్లూరులో పునరావాస కేంద్రానికి మహిళను తరలించిన అధికారులు

చిలుకూరు : మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో బుధవారం వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చిలుకూరు, నారాయణపురం, బేతవోలు గ్రామాల్లో చెరువులు నిండుకుండలా మారాయి. చిలుకూరు అంతర్గంగ వంతెన బ్రిడ్జి తాకుతూ నీరు ప్రవహిస్తోంది. ఇలాగే కొనసాగితే వంతెనపై నీళ్లు ప్రవహించి పాత చిలుకూరుకు రాకపోకలు బంద్ అవుతాయి. బేతవోలు రోడ్డులో పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో వరి పొలం దెబ్బతిన్నది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు

నేరేడుచర్ల: గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో మండలంలోని కల్లూరు గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలోని ప్రజలను గ్రామ పంచాయతీ అధికారులు బుధవారం పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి పద్మ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వెంకట్రావు ఆదేశాల మేరకు గ్రామంలో శిథిలావస్థలో ఉన్న రెండు ఇళ్లను గుర్తించి వారిని గ్రామ పంచాయతీ భవనం , ప్రాథమిక పాఠశాలలో ఆశ్రయం కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగవేణి, ఫీల్డ్ అసిస్టెంట్ శోభన్‌బాబు, గ్రామ పంచాయతీ సిబ్బంది కృష్ణయ్య, రాములు, వెంకటయ్య తదితరులున్నారు.

చెరువుల్లోకి వరదనీరు

కోదాడరూరల్ : మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని చెరువుల్లోకి వరదనీరు వచ్చి చేరింది. వర్షం ఇలాగే కొనసాగితే గురువారం వరకు చెరువులన్నీ అలుగు పోస్తాయని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. చిమిర్యాల వద్ద ఉలకవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటివరకు పంటలకు ఎలాంటి నష్టం జరగలేదు.

వర్షానికి కూలిన పూరిల్లు

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెంలో వర్షానికి ఉప్పతల వీరయ్య పూరిల్లు మంగళవారం రాత్రి కూలింది. బుధవారం స్థానిక సర్పంచ్ విజయకుమారివెంకటరెడ్డి, ఎంపీటీసీ నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు కూలిన ఇంటిని పరిశీలించారు. కూలిన ఇంటి సమాచారాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేసినట్లు కార్యదర్శి తెలిపారు. కాగా బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్, ఎంపీటీసీలు కోరారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్లకు మరమ్మతులు

అనంతగిరి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్.. అధికారులు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ సర్పంచ్ వేనేపల్లి వెంకటేశ్వరరావు గ్రామంలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ బీసీ కాలనీలోని మిషన్ భగీరథ ట్యాంకును కలెక్టర్ పరిశీలించి పూర్తిస్థాయిలో నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం మిషన్ భగీరథ డీఈ దేవభిక్షం, ఏఈ నాగరాజు, ఎంపీడీఓ విజయ హుటాహుటిన గ్రామానికి చేరుకుని గ్రామంలో పలుచోట్ల లీకేజీ అయిన భగీరథ పైపులను గుర్తించి మరమ్మతులు చేసి నీళ్లు వదిలారు. గ్రామంలోని ఇళ్లకు నీటి సరఫరా సక్రమంగా జరుగుతుందా లేదా అని పరిశీలించి నీరు అందుతుందని నిర్ధారించుకున్నారు. వారి వెంట సర్పంచ్ వేనేపల్లి వెంకటయ్య తదితరులు ఉన్నారు.



అనంతగిరిలో మిషన్ భగీరథ నల్లాల పనులు చేయిస్తున్న అధికారులు

మట్టి కుప్పలను చదును చేయాలి

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు పాత నేరేడుచర్లలో రోడ్డు వెంట పోసిన మట్టి కుప్పలను చదును చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సంకలమద్ది సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం పాత నేరేడుచర్లలో రోడ్డు వెంట ఉన్న మట్టి కుప్పలు, బండరాళ్లను పరిశీలించి మాట్లాడారు. గత ఆరు నెలల క్రితం రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మట్టి కుప్పలు, రాళ్ల కుప్పలు పోసి వదిలివేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డు వెంట ఉన్న బండరాళ్లను తొలగించి, మట్టి కుప్పలను చదును చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాల వెంకటేశ్వర్లు, నాయకులు అశోక్, నరేందర్‌రెడ్డి, సైదులు, నాగిరెడ్డి, సురేష్ తదితరులు ఉన్నారు.



పాత నేరేడుచర్లలో రోడ్డు వెంట మట్టికుప్పలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు